క్లుప్తంగా

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రం, బంగారుపతకాన్ని అందుకుంటున్న శ్యామల

సత్తుపల్లిటౌన్: మైసూర్ దత్తపీఠం ఆధ్వర్యాన భగవద్గీత కంఠస్థ పోటీలలో సత్తుపల్లికి చెందిన వేముల శ్యామల బంగారు పతకం సాధించింది. సోమవారం విజయవాడలోని దత్తక్షేత్ర ప్రాంగణంలో శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని ఆమె అందుకున్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జోనల్ స్థాయి చదరంగం పోటీల్లో స్థానిక మిరాకిల్‌మైండ్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-13 విభాగంలో జదిత్య ప్రథమ బహుమతి, అండర్-11 విభాగంలో జాన్సన్ తృతీయ బహుమతి సాధించారు. వీరిని పాఠశాల చైర్మన్ డెన్నీ ఇజ్రాయిల్, డైరెక్టర్ రత్నాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని మున్సిపల్ కౌన్సిలర్ కోన ధనికుమార్ కోరారు. మధిరలోని శివాలయం రోడ్డులో హిందూ శ్మశానవాటిక స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్న ఆయన స్థల సర్వే చేయించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, పట్టణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సీపీఐ నాయకుడు బెజవాడ రవిబాబు తదితరులు తహసీల్దార్ రాంబాబుకు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత



కళావేదిక నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మధిర: ప్రభుత్వ పాఠశాలల్లో సాధారణంగా పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారని, అందుకోసమే ప్రభుత్వ పాఠశాలలకు చేయూత అందిస్తున్నట్లు సీవీఆర్ చిట్స్ అధినేత చెరుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రూ.5 లక్షల సొంత నిధులతో ఆయన శాశ్వత కళావేదిక నిర్మాణం చేపడుతున్నారు. సీవీఆర్ తల్లిదండ్రులు చెరుకూరి నరసయ్య, సుబ్బమ్మ జ్ఞాపకార్థం గత కొద్ది సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ నిర్మాణాన్ని పర్యవేక్షించిన వారిలో గ్రామ పెద్దలు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత, నాయకులు, పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ..

హరిజనవాడ పాఠశాలకు సీవీఆర్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత వెంకటేశ్వరరావు మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు దాతను సన్మానించారు.

ముత్యాలమ్మ గుడికి మైక్‌సెట్ వితరణ

తల్లాడ: తల్లాడ మండలం లక్ష్మీనగర్ గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మైక్ సెట్ వితరణగా అందజేశారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి కటికి వెంకటేశ్వర్లు, కోశాధికారి శీలం వెంకట్‌రెడ్డి ముత్యాలమ్మ గుడి కమిటీ సభ్యులకు మైక్‌సెట్ అందజేశారు. తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు రగ్గులు పంపిణీ

కల్లూరు: మండల పరిధిలోని ముగ్గు వెంకటాపురం పంచాయతీ చైతన్య నగర్‌లో స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో బేబీ సరోజిని జ్ఞాపకార్థం.. కుమారుడు చైతన్య ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు, వృద్ధులు, వితంతువులు 50మందికి సోమవారం రాత్రి రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు, లెక్చరర్ శ్రీనివాసరావు, గోపాలరావు పాల్గొన్నారు.

అన్నదాత ఆగం

ధాన్యం కొనుగోళ్లలో తాత్సారం

- ఐకేపీ కేంద్రాల్లో రైతుల పడిగాపులు
- తేమ శాతం పేరుతో కొర్రీలు
- గోనె సంచుల కొరత



బోనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు

బోనకల్: అన్నదాత ఆగమైపోతున్నాడు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని పండించిన పంటను అమ్ముకోవడానికి నానా ఆగచాట్లు పడుతున్నాడు. కొనుగోలు కేంద్రాల్లో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ నిరీక్షిస్తున్నాడు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. కానీ అధికారులు తేమశాతం పేరుతో కొర్రీలు పెడుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఐదు సెంటర్లద్వారా కొనుగోళ్లు..

మండలంలో ఐకేపీ(ఇందిరా కాంత్రి పథం) ఆధ్వర్యంలో 5 సెంటర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా సొసైటీల ద్వారా మరో నాలుగు కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలు పెట్టారు. నిబంధనలు ప్రకారం 8 నుంచి 12శాతం ఉన్న ధాన్యం క్వింటాకి సన్నరకం రూ.2,320, దొడ్డురకం రూ.2,300కు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు మిషన్ ద్వారా తేమ శాతాన్ని చూస్తున్నారు. అదే విధంగా ఆ రైతు ఖరీఫ్ సీజనల్‌లో వరిపంట వేసి వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసి ఉండాలి. అప్పుడే అధికారులు తేమ శాతాన్ని పరిక్షిస్తారు.. లేకపోతే ఇక అంతే సంగతులు. ఇలా ధాన్యం కొనుగోలులో నిబంధనలు శాపంగా మారాయి.

రైతుల ఇబ్బందులు..

శీతాకాలం కావడంతో వడ్లు ఆరబోసి సాయంత్రం



ధాన్యాన్ని తిరగతోడుతున్న రైతు

కుప్పగా చేస్తుండడంతో అధిక తేమశాతం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల వద్ద, కల్లాల్లో ఆరబోసి తీసుకెళ్లినప్పటికీ మరలా కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోయాల్సిన పరిస్థితి దాపురించింది. ఇలా రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇదిలా ఉండగా కాంటాలు వేయడానికి గోనెసంచుల కొరత కూడా మరో సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాలు సొంత గ్రామాల్లో లేకపోవడంతో కిరాయి కూడా రైతులకు భారంగా మారింది. తేమ శాతాన్ని సడలించి కొనుగోళ్లు జరపాలని రైతులు కోరుతున్నారు.

గోనె సంచుల కొరతపై రైతుల నిరసన



పూసలపాడు సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

వైరారూరల్: మండలంలోని పూసలపాడు సొసైటీలో చినిగిన గన్నీ సంచులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. పూసలపాడు సొసైటీ పరిధిలో పూసలపాడుతో పాటు గౌండ్లపాలెం, నారపునేనిపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులకు 15వేల గన్నీ సంచులు అవసరం ఉండగా.. సివిల్ సప్లయ్ అధికారులు కేవలం 5వేలు మాత్రమే కార్యాలయానికి పంపారు. అవికూడా కొతమేర చినిగి ఉండడంతో రైతులు నిరసన తెలిపారు. దాంతో సొసైటీ నిర్వాహకులు సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలపడంతో రైతులు నిరసన విరమించారు.

పడిగాపులు కాస్తున్నా..



కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకువచ్చి 18రోజులు అయింది. వర్షం వస్తుందేమోనని ప్రతిరోజు కుప్ప చేయాల్సి వస్తుంది. 16శాతం వచ్చిన కాంటా వేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవడమే మేలనిపిస్తుంది. ప్రతిరోజు కొనుగోలు కేంద్రం వద్దనే పడుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

– ఆముదాల శ్రీను, రైతు, చిరునోముల

సంచులు కొరత లేకుండా చూడాలి..



కొనుగోలు కేంద్రంలో గోనె సంచుల కొరత లేకుండా చూడాలి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ముందుగానే సంచులను పంపించాలి. ఆన్‌లైన్‌లో పంట నమోదు, తేమ శాతం నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ చేయకుండా కాంటాలు త్వరితగతిన పూర్తి చేయాలి.

– నిమ్మతోట ఖానా, రైతు, చిరునోముల

మా గురువులకు నేను స్టూడెంట్‌నే..



ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: నేను డాక్టర్‌ని అయినా.. ఎమ్మెల్యేని అయినా.. మా గురువులకు స్టూడెంట్‌నే.. గురువులు చెప్పింది విని వారిబాటలో నడిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని పాతసెంటర్ యూపీఎస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లితే గురువులు ఎంతో గొప్పగా చెప్పుకుంటారని, తల్లిదండ్రులు ఎంతో గర్వపడతారన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చింతా కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన వైద్య సిబ్బంది కలిసి ఆమెను సత్కరించారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి కమిషనర్ మందా రవిబాబు, అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, సీడీపీఓ కనకదుర్గ, సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్‌ఎం ఆర్.నాగమణి, ఉపాధ్యాయులు, గాదె చెన్నారావు, కమల్‌పాషా, దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

ఈ నెల 12న ముగ్గుల పోటీలు

మధిర: మధిరలోని సుందరయ్య నగర్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యాన ఈనెల 12న ముగ్గుల పోటీలు ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కౌన్సిలర్లు మల్లాది వాసు – నవిత ఆధ్వర్యాన ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. సుందరయ్య నగర్‌లోని అన్నపూర్ణ హోటల్ రోడ్డులో జరిగే పోటీల్లో మొదటి నలుగురు విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేల బహుమతులు అందిస్తామని తెలిపారు. కాగా, పోటీలకు సినీ నటులు శ్రీకాంత్, సురేఖవాణి, మీనాకుమారి, ప్రవీణ, రజిత, యాంకర్ సుమ హాజరవుతారని పేర్కొన్నారు. మహిళలు పేర్ల నమోదు కోసం 96527 05689, 70363 61181 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు

కారేపల్లి: ఇటీవల నూతన ఉపాధ్యాయులుగా ఎంపికై సింగరేణి మండలంలో విధులు నిర్వర్తిస్తున్న 28మంది ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్లు (సేవా గ్రంథాలు) ఎంఈఓ జయరాజు చేతుల మీదుగా కారేపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విధి నిర్వాహణలో ఎస్‌ఆర్ తప్పనిసరి అని, సర్వీస్ రిజిస్టర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, మంగీలాల్, మండల కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, సతీష్, శంకర్, రమేష్, రాజ్‌కుమార్, శ్రీలత, అనూష తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..



కమ్మేసిన మంచుదుప్పటి

మంచు దుప్పటి సత్తుపల్లిని కమ్మేసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు దట్టంగా కమ్మేయటంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉదయం ఎనిమిదినుంచి కూడా లైట్లు వేసుకొని మరీ వాహనాలు నడుపుతున్నారు. మంచుతెరలను చీల్చుకుంటూ భానుడు 8.30 గంటల సమయంలో ప్రకాశించాడు. దీంతో మంచుతెరలు వీడాయి.

– సత్తుపల్లి టౌన్



లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనదారులు

'బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా సరికాదు'

కల్లూరు: రైతులను మోసం చేసిన బీఆర్‌ఎస్ పార్టీ నేడు రైతుల కోసం ధర్నాలు, నిరసనలు చేయడం సరికాదని సత్తుపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పరిమి భరత్ పేర్కొన్నారు. సోమవారం కల్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు సన్నరకానికి రూ.500 బోనస్ ఇచ్చిందని, కానీ బీఆర్‌ఎస్ రూ.లక్ష రుణమాఫీ అని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు.

సీపీఐ సభ్యుడు సత్యంకు ఘన నివాళి..

కొణిజర్ల: పేదలు సంక్షేమ పథకాలు అందుకుంటున్నారంటే అది కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని తనికెళ్లలో సీపీఐ సీనియర్ నాయకుడు తుళ్లూరి పెద్ద సత్యం 19వ వర్ధంతి నిర్వహించగా.. నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జితేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మండల అధ్యక్షుడి రాజీనామా



భట్టిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

ఎర్రుపాలెం: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చావా రామకృష్ణ, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పంబి సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు తీరు నచ్చక పార్టీకి రాజీనామా చేశామని, త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

తహసీల్‌లో ప్రజావాణి

కల్లూరురూరల్: కల్లూరు తహసీల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చాయి. ఒకటి భూమికి సంబంధించిన దరఖాస్తు కాగా.. మరొకటి పెన్షన్‌కు సంబంధించినది. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయాధికారిణి రూప, ఐసీడీఎస్ ఏసీడీపీఓ రత్తమ్మ, ఇన్‌చార్జ్ ఎంఈఓ నివేదిత, వెటర్నరీ డాక్టర్ మమత, ఎంపీఓ సురేష్‌బాబు, విద్యుత్‌శాఖ ఏఈ వెంకట్, వైద్యఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ రామారావు, ఐకేపీ ఏపీఎం వెంకట రామారావు, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

కొణిజర్ల: రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని వైరా ఎంవీఐ వరప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు, బస్సు డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు మద్యం సేవించి బస్సు నడపొద్దన్నారు. విద్యార్థులు ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారులో సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ రవిచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, డైరెక్టర్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

కల్లూరురూరల్: మండలంలోని వివిధ శాఖలలో చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సోషల్ వెల్ఫేర్, విద్యుత్‌శాఖ, నీటిపారుదల శాఖ, ఐకేపీ, ఉపాధి హామీ పథకం కార్యక్రమాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌బాబు, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ రత్తమ్మ, వ్యవసాయశాఖ అధికారి ఎం.రూప, ఎంఈఓ నివేదిత, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, వైద్యాశాఖ నుంచి సూపర్‌వైజర్ రామారావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసనలు



మధిర: తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మధిర/చింతకాని/ముదిగొండ: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, లక్ష్మారెడ్డి, కార్యదర్శులు వెంకట్ గౌడ్, వెంకట్రామయ్య తెలిపారు. ఈ మేరకు మధిర, చింతకాని, ముదిగొండలోని తహసీల్‌లో ధర్నా నిర్వహించి తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, అనంతరాజు, సునీత ఎల్జిబెత్ లకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమాలల్లో నాయకులు నాగబాబు, గిరి, జాంబు నాయక్, నాగేశ్వరరావు, అప్పారావు, రాంబాబు, సురేష్, ఉమామహేశ్వరరెడ్డి, తిమోతి, పూర్ణచంద్రరావు, వీరారెడ్డి, హనుమంతురావు, నర్సయ్య, కోటయ్య, రామారావు, ప్రసాద్, నవీన్, పానకాలరావు, వెంకటప్రసాద్, సీతారామయ్య, మల్లయ్య, నాగార్జున, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

- సత్తుపల్లిటౌన్/కల్లూరు/వేంసూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, కల్లూరు అంబేడ్కర్ సెంటర్లలో నిరసన తెలిపారు. అదే విధంగా వేంసూరులో నాయకులు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎంఏ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, రఫీ, హరికృష్ణారెడ్డి, ఉమా, బంగార్రావు, అప్పారావు, నాగయ్య, ఆయూబ్‌పాషా, మాజీ జెడ్పీటీసీలు అజయ్‌కుమార్, లక్కినేని రఘు, మాజీ ఎంపీపీ రఘు, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

చింతకాని: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ప్రొద్దుటూరులో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన దళితబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్టు వంటి పథకాలను నిలిపివేసిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేంతవరకు ఉద్యమించాలని తెలిపారు. ప్రభుత్వ దుర్మార్గ పాలనను ప్రజలకు వివరించి.. ఎన్నికల్లో గులాబీ పార్టీ సత్తా చూపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు లచ్చయ్య, రమేష్, హనుమంతురావు, నర్సయ్య, సురేష్, కోటయ్య, అప్పారావు, పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం



తల్లాడ: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఎర్రుపాలెం/తల్లాడ: కమ్యూనిస్టు పార్టీల పోరాటాలతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని రామాపురంలో నిర్వహించిన కామ్రేడ్ బుర్రి రవికుమార్ స్తూపం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరవీరుల త్యాగాల పునాదుల పైనే సీపీఎంకి పేరుందన్నారు. అనంతరం గ్రామంలో పలువురు సీపీఎంలోకి చేరారు. అదే విధంగా తల్లాడలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఉచిత బస్సుతప్పా.. ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. హామీలు అమలు చేయాలని కోరుతూ తల్లాడలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యుడు వీరయ్య, సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి, నాయకులు రమేష్, శ్రీనివాసరావు, కృష్ణార్జున్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, జోగయ్య, సంజీవరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ..



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ముదిగొండ: హైందవశంఖారావంతో మతోన్మాదాన్ని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు రెచ్చగొడుతున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో కల్యాణ్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు వరప్రసాద్, పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్జి కార్తీక్ రెడ్డి

మధిర: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మధిర కోర్టులో సోమవారం న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి ఆవిష్కరించారు. మధిర ఏపీపీ జన్ను భద్రయ్య ఆధ్వర్యంలో క్యాలెండర్ రూపొందించడానికి సహకరించిన సీనియర్ న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావును న్యాయమూర్తి అభినందించారు. న్యాయవాదులు నంబూరు జనార్దన్ రావు, కట్టా పూర్ణచంద్రరావు, సుంకుమోహన్ దాస్, పల్లపోతుల కృష్ణారావు, కోట జ్ఞానేశ్, విజయ్ కుమార్, సతీష్, సునీత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

- తల్లాడ: బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం ఆవిష్కరించారు. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో బీఆర్‌ఎస్ నాయకుల సమక్షంలో క్యాలెండర్లను విడుదల చేశారు.